www.vishalabharati.com
epaper:vishalabharati.com
TELANGANA POLITRICKS
పాలిట్రిక్స్
2023-2024
విశాల భారతి
vishalabharathi Telugu Daily
గురువారం, 02.11.2023
హైదరాబాద్
1.00pm editon

పాలిట్రిక్స్

పొత్తు పొడిసేనా?

- కాంగ్రెస్, కమ్యూనిస్టుల మధ్య కుదరని ఏకాభిప్రాయం
- సీట్ల సర్దుబాటులో ఇంకా రాని స్పష్టత
- ఒంటరిగానే పోటీ చేస్తామంటున్న సీపీఎం!
- 'హస్తం'తో నేస్తమే అంటున్న సీపీఐ పెద్దలు
- పార్టీల క్యాడర్, ఆశావహుల్లో ఆందోళన

విశాల భారతి, స్టేట్ బ్యూరో:

కాంగ్రెస్, కమ్యూనిస్టుల పొత్తు అంశం రాష్ట్ర వ్యాప్తంగా కాకా పుట్టిస్తోంది. అటు ఎలక్షన్‌నోటిఫికేషన్, నామినేషన్ల గడువు ముంచుకొస్తోంది. అంతా అనుకున్నట్లు జరిగితే వెంటనే కమ్యూనిస్టులు ప్రచారం షురూ చేసేందుకు కూడా రెడీ అయ్యారు. కానీ సీట్ల సర్దుబాటులో ఏకాభిప్రాయం కుదరనట్లే తెలుస్తోంది. ఇంతకు కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసే కదనాన దూకుతాయా? బీఆర్ఎస్, బీజేపీపై కత్తులు దూస్తాయా? కాంగ్రెస్ హైకమాండ్‌ఆంతర్యమేమిటో అర్థం కాని పరిస్థితి.. పొత్తు కుదరకపోతే ఎర్రన్నల ఎత్తుగడలేంటీ? మొత్తం మీద సీపీఐ సీట్లపై ఓకే అంటున్నా.. సీపీఎం సీట్ల సర్దుబాటుతోనే పొత్తులు ముడిపడి ఉన్న తరుణంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది.

లెఫ్టా..రైటా..? ముందుకా..వెనక్కా..? ఇదీ తెలంగాణలో కాంగ్రెస్‌వామపక్షాల పొత్తుల కథ.. నామినేషన్లకు గడువు ముంచుకొస్తున్నా కూడా.. లెఫ్ట్ పార్టీలతో కాంగ్రెస్ పొత్తు చర్చలు కొలిక్కి రావడం లేదు. దీంతో ఇటు లెఫ్ట్ పార్టీల్లోనూ..అటు 'హస్తం' పార్టీలోనూ సస్పెన్స్ కొనసాగుతోంది. నిన్నటివరకు సీపీఐకి రెండు.. సీపీఎం కు రెండు స్థానాలంటూ ప్రచారం జరిగింది. తాజాగా మల్లీ సీన్ మారింది. ఈ క్రమంలో కామ్రేడ్లు కీలక వ్యాఖ్యలు చేశారు. తాము విధించిన గడువు ముగిసినా కూడా కాంగ్రెస్ నుంచి స్పందన రాకపోవడంతో సీపీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. పొత్తుపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని.. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాము పాలేరు, భద్రాచలం అడిగితే.. వైరా, మిర్యాలగూడ ఇస్తామన్నారని... ఇప్పుడేమో.. హైదరాబాద్‌లో ఒక సీటు ఇస్తామంటున్నారని తమ్మినేని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. సీపీఐ కలిసొస్తే ఓకే..లేదంటే ఒంటరిగానే సీపీఎం పోటీ చేస్తుందని తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. కూటమి ధర్మం పాటించకపోతే నష్టపోయేది కాంగ్రెస్సే.. అని సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి పేర్కొన్నారు. వామపక్షాలను కాదనుకుంటే తెలంగాణలో అధికారం దక్కదని హెచ్చరించారు.సీపీఎం.. సంగతి ఇలా ఉంటే.. సీపీఐ మాత్రం తమ ప్రయాణం కాంగ్రెస్‌తోనేనని చెబుతోంది. సీట్ల కేటాయింపుపై కాంగ్రెస్ హైకమాండ్‌నుంచి తమకు స్పష్టమైన భరోసా ఉందని ఆ పార్టీ సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ చెప్తున్నారు. కొత్తగూడెం, బెల్లంపల్లి సీట్లు తాము కోరామని అయితే బెల్లంపల్లి కాకుండా చెన్నూరు తీసుకోమని కాంగ్రెస్ చెప్పిందన్నారు. వివేక్ వెంకటస్వామి కాంగ్రెస్‌లో చేరినా కూడా తమ సీటుకు వచ్చిన ఇబ్బంది లేదన్నారు. వివేక్ కాంగ్రెస్‌లో చేరడం శుభపరిణామమన్న నారాయణ.. చెన్నూరులో తమ గెలుపునకు వివేక్ కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఇక జాతీయ స్థాయిలో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా తెలంగాణలో కాంగ్రెస్‌తో తమ పొత్తు ఉంటుందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా చెప్తున్నారు. తాము అడిగిన సీట్లు కాంగ్రెస్ పార్టీ ఇస్తుందన్న నమ్మకం ఉందన్నారు. బీజేపీని ఓడించేందుకు కలిసి వచ్చిన వారితో పొత్తులు ఉంటాయన్నారు.

సీపీఐ, సీపీఎం సమావేశం..

ఈ క్రమంలో సీపీఐ, సీపీఎం కార్యవర్గాలు విడివిడిగా సమావేశమయ్యాయి. అయితే, పొత్తుపై కాంగ్రెస్ నుంచి సమాధానం లేకపోవడంతో.. ఒంటరి పోరుపై సీపీఎం నేతలు చర్చిస్తున్నారు. ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో పోటీపై చర్చ కొనసాగుతోంది. కాంగ్రెస్ స్పందించకపోతే..తాము మాత్ర పోటీ చేస్తామని సీపీఎం స్పష్టం చేసింది.. ఈ క్రమంలో సీపీఐ మాత్రం కాంగ్రెస్ పొత్తు ధర్మం పాటిస్తుందంటూ పేర్కొంది..

మునుగోడు తర్వాత మారిన సీన్..

మునుగోడు ఉపఎన్నికలో తమతో పొత్తు పెట్టుకున్న బీఆర్ఎస్.. అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఒంటరి పోరుకు దిగింది. దీంతో కాంగ్రెస్‌తో జత కట్టాలని సీపీఐ, సీపీఎం నిర్ణయించుకున్నాయి. అందుకు కాంగ్రెస్ కూడా సరేనంది. మొదట్లో సీపీఐ, సీపీఎం చెరో ఐదు స్థానాలు కాంగ్రెస్‌ను కోరగా ఆ తర్వాత జరిగిన చర్చల్లో మూడు చొప్పున సీట్లు ఇవ్వాలని అడిగాయి. చివరకు ఆ సంఖ్య రెండేసి స్థానాల వద్దకు చేరుకుంది. ఇప్పుడు వాటిపై కూడా క్లారిటీ రాకపోవడంతో లెఫ్ట్‌పార్టీల్లో అసంతృప్తి నెలకుంది. దీంతో ఒంటరి పోరుకు సీపీఎం మొగ్గుచూపుతుండగా..సీపీఐ మాత్రం ఇంకా ఆశలు పెట్టుకుంది.

ఇంకా కొలిక్కి రాని డోర్నకల్ టికెట్..

- అయోమయంలో కాంగ్రెస్ క్యాడర్
- తమకే ఇవ్వాలని సీనియర్ నేతల పట్టు
- సమర్థుడైన అభ్యర్థి కోసం హైకమాండ్ ఆరా
- కొత్తవారికే టికెట్ ఇస్తారనే ప్రచారం
- భూపాల్ నాయక్‌కు ఇవ్వాలంటున్న క్యాడర్
- నేడో రేపో ప్రకటించనున్నట్లు సమాచారం

విశాల భారతి, స్టేట్‌బ్యూరో ప్రతినిధి:

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు రంగం సిద్ధమవుతోంది. అధికార పార్టీ బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటన పూర్తి చేసి, ప్రచారంలో దూసుకుపోతోంది. అయితే ప్రతిపక్షాలు మాత్రం అభ్యర్థుల వేట మునిగితేలుతున్నాయి. ముఖ్యంగా మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్ ఇంకా కొలిక్కి రాలేదు. రెండో జాబితాలోనే టికెట్ వస్తుందని కాంగ్రెస్‌నేతలు భావించారు. అయితే.. సెకండ్‌లిస్ట్‌లోనూ డోర్నకల్ పేరు కనించలేదు. దీంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నిరాశ నెలకొంది. త్వరలో అభ్యర్థిని ప్రకటించాలని డిమాండ్‌చేస్తున్నారు.

డోర్నకల్ అసెంబ్లీ నియోజవకర్గంలో ముగ్గురు ఆశావాహులు టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. నానావత్‌భూపాల్ నాయక్, డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్, మాలోతు నెహ్రూనాయక్‌లు తీవ్రంగా పోటీపడుతున్నారు. అయితే ఈ సారి పాత వారికి కాకుండా, కొత్త వారికి టికెట్ ఇస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న నేతలకు మాత్రమే టికెట్ ఇవ్వాలంటూ సీనియర్లు డిమాండ్ చేస్తున్నారు. అయితే కొత్త వారైనా సరే.. గెలిచే దమ్మున్న అభ్యర్థి కోసం కాంగ్రెస్‌హైకమాండ్ క్యాడర్‌ను ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో డోర్నకల్‌కాంగ్రెస్‌క్యాడర్‌తో పాటు నియోజకవర్గంలోని పలు ప్రజా సంఘాల నేతలు భూపాల్‌నాయక్‌కు టికెట్ ఇవ్వాలని డిమాండ్‌చేస్తున్నారు. భూపాల్ నాయక్‌కు ఇస్తే గెలిపించి తీరుతామని కాంగ్రెస్‌పార్టీకి భరోసా ఇస్తున్నారు.

ఉమ్మడి వరంగల్‌జిల్లాలోని 12 సీట్లలో కాంగ్రెస్‌పార్టీ డోర్నకల్‌మినహా 11 సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది. దీంతో కాంగ్రెస్ ఆశావహుల్లో అయోమయం నెలకొంది. డోర్నకల్ కాంగ్రెస్ టికెట్ ఖరారు విషయంలో ఇల్లందు టికెట్‌కు లింకు పెడుతూ ఒక సీనియర్ రాజకీయవేత్త పీటముడి వేశారని పార్టీలో చర్చ ఆరంభమైంది. మహబూబాబాద్ టికెట్ చేజారిన సదరు సీనియర్ నేత.. ఇల్లందు అ సెంబ్లీ సీటైనా తనకు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. అయితే ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి చేరకముందు నుంచే తనవర్గమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జడ్పీ చైర్మన్, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే కోరం కనకయ్యకే టికెట్ ఇవ్వాలని పట్టుబడుతుండడంతో అధిష్టానం ఎటు నిర్ణయం తీసుకోలేకపోతోందని తెలుస్తోంది. ఒకవేళ ఇల్లందు సీటు తనకు ఇవ్వకుంటే డోర్నకల్ సీటైనా తాను సూచించిన అభ్యర్థికి ఇవ్వాలని సదరు కాంగ్రెస్ సీనియర్ నేత తిరకాసు పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో అటు ఇ ల్లందు, ఇటు డోర్నకల్ రెండు టికెట్ల ప్రకటనలో జాప్యం జ రుగుతోందని చెబుతున్నారు. ఇదిలా ఉంటే నానావత్‌భూపాల్‌నాయక్‌కే టికెట్ కన్‌ఫార్మ్ అన్న ప్రచారం సాగుతోంది. ఇప్పటికే ఆయన పీసీసీ రేవంత్‌రెడ్డిని పలు మార్లు కలిశారు. ప్రజల మధ్య ఉండడమే ప్రామాణికంగా తీసుకుంటున్న భూపాల్ నాయక్ టికెట్ విషయం తేలకుండానే.. హడావిడి లేకుండానే ప్రచారం చేసుకుంటున్నారు. టికెట్ ఖరారైన తరువాత ప్రచారాన్ని ముమ్మరం చేస్తానని భూపాల్‌నాయక్‌చెబుతున్నారు. అయితే, ఇక్కడ టికెట్ ఆశిస్తున్న రాంచంద్రునాయక్, నెహ్రూనాయక్‌ఇద్దరూ పాత ముఖాలే కావడంతో ఉమ్మడి వరంగల్‌జిల్లాలోని పాలకుర్తి లో యశస్వినీ రెడ్డి తరహాలో యువకుడైన భూపాల్‌నాయక్‌ను రంగంలోకి దించాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అతడికే అవకాశం ఇవ్వాలని పార్టీలకతీతంగా ప్రజా సంఘాల నాయకులు కాంగ్రెస్‌హైకమాండ్‌ను కోరడం గమనార్హం.

ఇక ఇక్కడ ఇప్పటికే.. బీఆర్ఎస్ ప్రచారాన్ని ఉధృతం చేసింది. బీఆర్ఎస్ అభ్యర్థి రెడ్యానాయక్ నియోజకవర్గం మొత్తం ఒక్కసారి తిరిగారు. వివిధ సభలు, సమావేశాలతో దూసుకుపోతున్నారు. కాంగ్రెస్ మాత్రం ఇంకా జనంలోకి వెళ్లలేదు.. పాత ముఖాలకు కాకుండా స్వచ్ఛందంగా జనంలోకి దూసుకెళ్తున్న భూపాల్‌నాయక్‌లాంటి కొత్తవారికి అవకాశం ఇస్తే, సహకరిస్తామని కాంగ్రెస్‌యువత చెబుతుండగా, పాతవారికే అవకాశం ఇవ్వాలని సీనియర్లు చెప్తున్నారు. ఒకవేళ పాత నేతలకు టికెట్ ఇస్తే యువత, ఆయా వర్గాల ప్రజలు కాంగ్రెస్‌కు దూరమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

టీటీడీపీ ఓటర్లు ఎటువైపు..?

- తెలంగాణలో సై'కిల్'తో ఎవరికి మేలు?
- కాపు, సీమాంధ్ర ఓట్ల కోసం బీజేపీ మాస్టర్ ప్లాన్
- టీడీపీ దోస్త్ జనసేనతో పొత్తుకు యత్నాలు
- సెటిలర్లను ఆకట్టుకునేందుకు బీఆర్ఎస్ ప్లాన్లు
- సెటిలర్లకు ప్రియారిటీ, 'కాసాని' మీద ఫోకస్
- ఇప్పటికే కాంగ్రెస్‌కు క్యూకట్టిన కమ్మ నేతలు
- తాము కాంగ్రెస్‌వైపే అంటూ బహిరంగ ప్రకటనలు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టీటీడీపీ పోటీకి దూరంగా ఉంటుందని ఆ పార్టీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో తెలంగాణలో ఈ సై'కిల్' నిర్ణయం ఏ పార్టీకి వరమవుతుందని రాష్ట్ర రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పడిన తర్వాత కూడా రాష్ట్రంలో టీడీపీని అభిమానించే ఓటర్లు ఉన్నట్లు గతంలోనే స్పష్టమైంది. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో టీడీపీ వీరాభిమానులు ఉన్నారు. అయితే, మారిన రాజకీయ పరిస్థితుల్లో టీడీపీ నేతలు, కార్యకర్తలు ఇతర పార్టీలకు షిఫ్ట్ అవుతున్నారు. తాజాగా టీడీపీ పోటీ చేయడం లేదని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఈ పార్టీ ఓటింగ్ ఎవరికి లాభం జరుగుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

విశాల భారతి, స్టేట్‌బ్యూరో ప్రతినిధి:

బీజేపీ టీడీపీ ఓట్ల గురించి ఏమైనా ఆలోచిస్తుందా? అంటే అవును అనే సంకేతాలే వినిపిస్తున్నాయి. తెలుగు దేశంతో పొత్తు లేకుండానే టీడీపీ ఓట్లను ఆకర్షించాలి అనే ఎత్తుగడతో పనిచేస్తోంది. ఈ ప్లాన్‌లో భాగంగానే కొన్ని రోజుల కింద రాష్ట్రపతి భవన్ లో ఎన్టీ రామారావు స్టాంపు విడుదల సందర్భంగా కూడా జేపీ నడ్డా , చంద్రబాబుతో మాట్లాడారు. ఈ వార్త తెలంగాణ ప్రజల్లోకి వెళ్లాలనే విషయం కూడా బీజేపీ చీఫ్‌ట్రోల్స్‌చేయించారని వార్తలు కూడా వచ్చాయి. అలా వ్యూహాత్మకంగానే టీడీపీ తో తాము సఖ్యతతో ఉన్నామని చెప్పడానికి బీజేపీ ప్రయత్నించింది. ఆ పరిణామం తర్వాత ఇటీవల చంద్రబాబు వ్యవహారంలో భాగంగా లోకేశ్ అమిత్ షాను కలిసిన సమయంలో ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురంధరేశ్వరితో పాటు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి కూడా వెళ్లడం దానికి సంకేతమే.. పురంధేశ్వరి స్వయాన కుటుంబ సభ్యురాలు కావడంతో ఒక వేళ వెళ్లినా.. ఇవన్నీ కూడా తెలంగాణలో టీడీపీ ఓట్లను ఆకర్షించడానికి బీజేపీ మాస్టర్‌ప్లాన్‌చేసిందనే వార్తలు వచ్చాయి. ముఖ్యంగా బీజేపీ జగన్‌కు అండగా ఉందన్న భావన టీడీపీ, చంద్రబాబును అభిమానించే ఓటర్లలో ఉంది. అది తెలంగాణలో తమ పార్టీకి నష్టం జరగకుండా బీజేపీ ఎత్తుగడ వేసింది. కానీ బీజేపీ ప్రధానంగా పోటీలో తెలుగు దేశం విషయంలో ఇంకా ఖరారు కాలేదు. చంద్రబాబు అరెస్ట్‌విషయంలో బీజేపీ సహకరించింది లేదు. అందువల్ల టీడీపీని అభిమానించే తెలంగాణ ఓటర్లు బీజేపీకి వెళ్తారా? అనేది ప్రశ్నార్థకమే..

ఇక బీఆర్ఎస్ విషయం చూస్తే... బీఆర్ఎస్ 2014 నుంచి వ్యూహాత్మకంగా టీడీపీలోని కీలక నేతలను తమ పార్టీలోకి తీసుకుంది. ఎర్రబెల్లి దయాకర్‌రావు, పట్నం మహేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, తలసాని శ్రీనివాస్‌యాదవ్ నిరంజన్‌రెడ్డి లాంటి నేతలను పార్టీలో చేర్చుకుంది. అలా టీడీపీ ఓట్లను బీఆర్ఎస్‌ఘననీయంగా ఆకర్షించింది. హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా ఇది కనిపించింది. కానీ ఇప్పుడు ఆ రకంగా బీఆర్ఎస్‌కు ఈ ఓటర్లు ఓటు వేస్తారా? ప్రశ్నార్థకంగా మారింది. ఎందుకంటే ఇటీవల చంద్రబాబు అరెస్ట్‌విషయంలో బీఆర్ఎస్‌మొదట్లో వ్యవహరించిన వైఖరి చాలా విమర్శలకు కారణమైంది. ఆ తర్వాత దానిని సరి చేసుకోవడానికి హరీశ్‌రావు, కేటీఆర్ చంద్రబాబు అరెస్ట్‌పైనా వ్యతిరేకంగా స్పందించడం, లోకేశ్‌కు సానుభూతి తెలపడం, చంద్రబాబు అరెస్ట్ అన్యాయం అంటూ కవిత ట్వీట్‌చేయడం లాంటి డ్యామేజ్‌కంట్రోల్ కోసం ప్రయత్నం చేసినా.. టీడీపీ అభిమానులు నమ్మే పరిస్థితి కనిపించడం లేదు. చంద్రబాబు అరెస్ట్‌విషయంలో కేసీఆర్‌ఇంతవరకు స్పందించకపోవడం టీడీపీ అనుకూల ఓటర్లు బీఆర్ఎస్ ముఖ్యనేతలు ప్రవర్తించిన తీరుపై గుర్రుగా ఉన్నారు. అందుకే ఇప్పటికే కమ్మ సంఘం నాయకులు తాము కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తామని ఓపెన్‌గానే ప్రకటించారు. అందువల్ల టీడీపీ అనుకూల ఓటర్లు బీఆర్ఎస్‌కు ఓటు వేస్తారా? అనేది అనుమానమే..

ఇక కాంగ్రెస్‌ను చూస్తే... కాంగ్రెస్‌పార్టీ చంద్రబాబు అరెస్ట్‌పై కూడా టీడీపీకి అనుకూలంగా స్పందించింది. పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డికి , చంద్రబాబుకు మధ్య గతంలో ఉన్న సంబంధాల వల్ల టీడీపీ క్యాడర్‌కూడా ఆయనపై సానుకూలంగానే ఉంటారు. ముఖ్యంగా 2018 ఎన్నికల్లో ఆయన మల్కాజ్‌గిరి నుంచి ఎంపీగా గెలుపొందడంలో కాంగ్రెస్‌కు బలం లేకపోయినా.. కూడా టీడీపీ పాత్ర ఎంతో ఉందనేది జగమెరిగిన సత్యం.

కాంగ్రెస్ వైపు కమ్మ సామాజికవర్గం..

ఇన్నాళ్లు టీడీపీకి అండగా ఉన్న కమ్మ సామాజిక వర్గం తాజా రాజకీయ పరిణామాల్లో కాంగ్రెస్ వైపు ఉండాలని నిర్ణయించింది. ఇప్పటికే ఆ సామాజిక వర్గం నేతలు బాహాటంగానే కాంగ్రెస్ కు మద్దతు పలికారు. కమ్మ సంఘం ఇప్పటికే కాంగ్రెస్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకోవడంతో టీడీపీ ఓటింగ్ కూడా కాంగ్రెస్‌కు అనుకూలంగా స్పందిస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా కమ్మ నేతలు తుమ్మల నాగేశ్వర్‌రావు, మండవ వెంకటేశ్వర రావులను పార్టీలో చేర్చుకుంది. ఆ సామాజిక వర్గం అత్యధికంగా ఉండే ఖమ్మం నియోజకవర్గం నుంచి తుమ్మలను ఎన్నికల బరిలో నిలిపింది. ఇలా కాంగ్రెస్‌పార్టీ టీడీపీ ఎన్నికల్లో పోటీ చేయకపోవడం వల్ల ఆ ఓటును తమవైపు తిప్పుకోవాలని చూస్తోంది. కానీ కాంగ్రెస్ కంటే బీజేపీ, బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. బీజేపీ జనసేనను కలుపుకోవడం ద్వారా, హైదరాబాద్‌శివార్లలోని నియోజకవర్గాల్లో జనసేనా పాత్తుతో లబ్ధి పొందాలని చూస్తున్నాయి. టీడీపీ జనసేనా బంధముంది కావునా.. జనసేనకు సానుకూలంగా ఉంటాయి. ఆరకంగా వారు ప్లాన్‌గీస్తున్నారు.. బీఆర్ఎస్‌ఒక అడుగు ముందుకేసి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కాసాని జ్ఞానేశ్వర్‌ను పార్టీలోకి చేర్చుకుని ఆయన ద్వారా చెప్పించడానికి ప్రయత్నం చేస్తుందని చర్చ సాగుతోంది. అందువల్లే ఆయనతో కాసాని జ్ఞానేశ్వర్‌ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

నేడు బీజేపీ థర్డ్ లిస్ట్!

- తెలంగాణ అభ్యర్థుల ఎంపికపై పూర్తయిన కసరత్తు..
- 40కి పైగా అభ్యర్థులను ప్రకటించే అవకాశం?
- జనసేనాకు 9 సీట్లు కేటాయించినట్లు సమాచారం..

విశాల భారతి, స్టేట్‌బ్యూరో: టీబీజేపీ ఎమ్మెల్యే క్యాండిడేట్స్ థర్డ్‌లిస్ట్ నేడు విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ జాబితాలో 40 మంది అభ్యర్థుల పేర్లుండొచ్చని తెలుస్తోంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో బుధవారం తెలంగాణ కోర్ కమిటీ నేతలు సమావేశమయ్యారు. ఈ భేటీకి కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, తెలంగాణ కోర్ కమిటీ నేతలు కిషన్ రెడ్డి, డీకే అరుణ, ఈటల రాజేందర్, బండి సంజయ్, డా.కే.లక్ష్మణ్, ప్రకాశ్ జవడేకర్, తరుణ్ చుగ్ హాజరయ్యారు. సుదీర్ఘంగా సాగిన ఈ భేటీలోనే అభ్యర్థుల ఎంపిక కొలిక్కి వచ్చింది. ఢిల్లీలోని బీజేపీ హెడ్‌క్వార్టర్‌స్‌లో పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశమైంది. అర్ధరాత్రి వరకు జరిగిన ఈ భేటీలో తొలుత రాజస్థాన్ అభ్యర్థులను కమిటీ ఖరారు చేసింది. తర్వాత తెలంగాణపై బీజేపీ సీఈసీ సమావేశమైంది. తెలంగాణలో మిగిలిన 66 స్థానాలపై చర్చించారు. జనసేనకు పొత్తుల్లో భాగంగా ఎన్ని సీట్లు కేటాయించాలన్న విషయంపై కూడా సెంట్రల్ ఎలక్షన్ కమిటీ చర్చించింది. జనసేనకు 9 సీట్లు ఇచ్చేందుకు హైకమాండ్ అంగీకారం తెలిపినట్టు తెలిసింది. ఫస్ట్‌లిస్టులో 52, సెకండ్‌లో ఒక పేరును ప్రకటించిన బీజేపీ, థర్డ్‌లిస్టులో 40కి పైగా అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. మిగతా స్థానాలపై తదుపరి మరోసారి 'సెంట్రల్ ఎలక్షన్ కమిటీ' భేటీ జరపాల్సిన అవసరం లేకుండా.. నిర్ణయాధికారాన్ని జాతీయాధ్యక్షుడికే వదిలేసే అవకాశం ఉంది. ఇతర పార్టీల్లో టికెట్లు ఆశించి, దక్కించుకోలేకపోయిన బలమైన నేతలను దృష్టిలో పెట్టుకుని కొన్ని స్థానాలను పెండింగులో ఉంచినట్టు తెలుస్తోంది. బుధవారం ఒక్కరోజే బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, ఎల్లారెడ్డి నుంచి కాంగ్రెస్ నేత సుభాష్ రెడ్డి, మునుగోడు నుంచి కాంగ్రెస్ నేత చలమల కృష్ణారెడ్డి, జహీరాబాద్ నుంచి బాణాల లక్ష్మారెడ్డి తదితరులు బీజేపీలో చేరారు. వారిలో బోథ్ మినహా మిగతా నేతలకు ఆయా స్థానాల్లో టికెట్లు ఇచ్చే అవకాశం ఉంది. బోథ్ నియోజకవర్గానికి అభ్యర్థిగా ఇప్పటికే సోయం బాపూరావు పేరును ప్రకటించిన నేపథ్యంలో కొత్తగా చేరిన సిట్టింగ్ ఎమ్మెల్యే బాపూరావుకు ఆదిలాబాద్ ఎంపీ టికెట్ ఇచ్చే విషయంపై చర్చ జరుగుతోంది.